క్లుప్తంగా

అంబేడ్కర్ స్ఫూర్తితోనే బడుగుల సాధికారత సాధ్యం

అచ్చంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితోనే దళిత, గిరిజన, మహిళా సాధికారత సాధ్యపడుతుందని అచ్చంపేట ఎస్‌ఐ కె.రవీంద్రపాల్ చెప్పారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన దళిత గిరిజన వాచ్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ దళత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధులు ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్ మల్లెల చిన్నప్ప, అచ్చంపేట మండల కన్వీనర్ సందెపోగు అశోక్, గుండాల మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): చాగంటివారిపాలెం గ్రామంలోని చేపల చెరువు లీజు కోసం శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా గ్రామానికి చెందిన మధిరవెంకటేశ్వరరెడ్డి రూ.1,33,500కు పాడుకున్నారు. ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ఆర్.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ వేలంను పర్యవేక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పీలా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ ఆదేశాల మేరకు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని శుక్రవారం ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

సత్తెనపల్లి: సినీ నటుడు రామ్‌చరణ్ యువశక్తి టీం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సుగాలీ కాలనీ జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ్ చరణ్ యువశక్తి పల్నాడు అధ్యక్షుడు సిరిగిరి నరేంద్ర, సిరిగిరి మణికంఠ, షేక్ ఖాజా, ఎ.చిన్ని, బాలయ్య, అనిల్, ఎ.మోహన్, పండు, రెహమాన్, పోతన పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల పునఃస్థాపన



రాజుపాలెం: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను యథావిధిగా పునఃస్థాపించామని విద్యుత్ ఏఈ వీవీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. మండలంలో అనుపాలెం, అంచులవారిపాలెం, కొండమోడు, వీరమ్మ కాలనీ, దేవరంపాడులలో స్తంభాలు పడిపోయాయని, కొన్ని విరిగిపోయాయని, వీటన్నింటినీ పునఃస్థాపించామని వివరించారు.

25 నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

రాజుపాలెం: గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 25 నుంచి వచ్చే నెల 22 వరకు పశువులకు, ఆవులకు, దూడలకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశువర్ధక శాఖ ఏడీ వీరయ్య శుక్రవారం తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం



క్రోసూరు: రంజాన్ మాసం ప్రారంభమైనందున ముస్లిం సోదరులు శుక్రవారం వేకువజాము నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించారు. మసీదుల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గాలివాన బీభత్సం

దుర్గి: దుర్గి, పరిసర గ్రామాలలో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. సుమారు అరగంటపాటు గాలివాన హడలెత్తించింది. చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వారు ఇబ్బందులు పడ్డారు. కల్లాల్లో ఉన్న మిర్చి, కంది, మొక్కజొన్న పంటలు తడవటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలు కప్పేలోపే గాలివాన కురవడంతో పంటలు పాడయ్యాయని వారు కన్నీటిపర్యంతమయ్యారు.

అవగాహనతోనే క్షయకు అడ్డుకట్ట

టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగపద్మజ



సత్తెనపల్లిలో జాతీయ క్షయ నివారణ దినం ర్యాలీ చేస్తున్న టీబీ యూనిట్ వైద్యులు, సిబ్బంది

సత్తెనపల్లి: రాష్ట్రాన్ని క్షయవ్యాధి రహితంగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అవగాహనతోనే క్షయకు అడ్డుకట్ట వేయవచ్చునని టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగ పద్మజ చెప్పారు. జాతీయ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగపద్మజ మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకితే చాలా మంది భయపడుతున్నారని, వ్యాధి సోకిన ఆరు నెలల పాటు మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. విలువైన మందులను ఉచితంగా రోగులకు ఇంటికే అందించి వ్యాధి నయమయ్యేవరకు ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రతినెల రోగి ఖాతాకు రూ.500 నగదును ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. దాతల సాయంతో పౌష్టికాహారం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రక్తంతో కూడిన కళ్లె పడటం వంటి లక్షణాలు గమనించిన వెంటనే టీబీ పరీక్ష, ఎక్స్‌రే పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తిస్తామన్నారు. ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ప్రతి రోగిని ఒకరు దత్తత తీసుకుని వారికి నెలకు రూ.700 ఖరీదు గల నిత్యావసర వస్తువులు ఆరు నెలల పాటు అందించే కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ స్టాలిన్, ఎస్.కె. ఇబ్రహీం, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, పీపీ యూనిట్ డాక్టర్ ధర్మ, డాక్టర్ మెహబూబ్ నిషా, హెల్త్ విజిటర్ ప్రేమకుమారి, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న రామకృష్ణ తదితరులు



క్రోసూరులో క్షయ రోగులకు ఫుడ్‌బాస్కెట్ అందజేస్తున్న డాక్టర్ ప్రవీణదీప్తి

క్రోసూరులో..

క్రోసూరు: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ ప్రవీణ దీప్తి ఆధ్వర్యంలో క్షయ నివారణపై అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ద్వారా 2025 నాటికి భారతదేశాన్ని టీబీ రహిత దేశంగా మార్చాలని పిలుపునిచ్చారు. నిక్షయ మిత్రద్వారా రోగులకు ఫుడ్ బాస్కెట్ అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం జెడ్పీపాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సాంబశివరావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం అవసరం



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ అనంతలక్ష్మి



పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దమ్మాలపాడు(ముప్పాళ్ల): దమ్మాలపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై బాలింతలకు, గర్భిణులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ ఇరుకుపాలెం సెక్టారు సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి పోషకాహారం తీసుకోకపోతే తలెత్తే సమస్యలను వివరించారు. అనంతరం తృణధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లులకు అందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అచ్చయ్య, నాగేశ్వరరావు, సురేష్, మాధవి, కళ్యాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, బుజ్జిరాణి, రమాదేవి, శ్రీదేవి, ప్రమీల, సుమలత, మహిళా పోలీసు పి.ఆశాలత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

75 త్యాళ్లూరులో..

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషణ్ పక్వాడ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ స్వర్ణ మాట్లాడుతూ అందరూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కిశోర బాలికలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మున్ని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామోదయం

బయ్యవరం(క్రోసూరు):మండలంలోని బయ్యవరం గ్రామంలో శుక్రవారం అధికారులు గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు స్థానిక జెడ్పీ పాఠశాల నుంచి ట్రాన్సెట్ వాక్ చేశారు. గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం సంపద కేంద్రాన్ని సందర్శించారు. క్లాప్ మిత్రలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ తీసుకున్నారు. జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ప్రార్థన గీతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శివరామయ్య, తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ , పీహెచ్‌సీ వైద్యురాలు ప్రవీణదీప్తి పాల్గొన్నారు.

75 త్యాళ్లూరులో..

పెదకూరపాడు: 75 త్యాళ్లూరులో గ్రామోదయం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రక్తహీనత నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, తహసీల్దారు క్షమారాణి, వైద్య అధికారి ప్రియాంక, సీడీపీఓ స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.



బయ్యవరం గ్రామంలో గ్రామోదయం కార్యక్రమంలో మండల అధికారులు



పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

పాడి రైతుల సంక్షేమం కోసం కృషి

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర గోకుల్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమం, లేగదూడల ప్రదర్శనను శుక్రవారం దుర్గి పశు వైద్యశాలలో నిర్వహించారు. కార్యక్రమాన్ని జెడ్పీటీసీ శెట్టిపల్లి యల్లమంద, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని చెప్పారు. పశువులకు సంచార వైద్య సేవలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. పల్నాడు జిల్లా పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పాడి రైతులు పశువైద్యాధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. అనంతరం జరిగిన లేగదూడల అందాల పోటీల్లో 80 దూడలు పాల్గొన్నాయి. తర్వాత పశుపోషకులకు బహుమతులు అందించారు. లేగదూడల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి.దిలీప్ పాల్గొన్నారు.



పాడి మహిళా రైతుకు బహుమతి అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యులు

కాఫీ విత్ క్లాప్ మిత్ర

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): చాగంటివారిపాలెం గ్రామంలో కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎంపీపీ మారూరి పద్మ పాల్గొని గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. క్లాప్‌మిత్రలు ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను తరలించే విధానాన్ని తెలుసుకున్నారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన బడి నాడు-నేడులో భాగంగా జరుగుతున్న పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని సందర్శించి ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. క్లాప్ మిత్రలతో కలిసి కాఫీ తాగారు. కార్యక్రమంలో సర్పంచ్ పీలా గాయత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మారూరి పద్మ, అధికారులు

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: కొమెరపూడి గ్రామంలో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ టి.శ్రీలత శుక్రవారం తెలిపారు. కొమెరపూడిలోని ఓసీ ముస్లిం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టును రోస్టర్ పాయింట్‌లో ఓసీ జనరల్‌కు కేటాయించినట్టు పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ ఒకటిన సాయంత్రం ఐదు గంటల లోపు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు స్వయంగా అందజేయాలని పేర్కొన్నారు. ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, అభ్యర్థిని 2022 జూలై 1 నాటికి 21 సంవత్సరాల వయసు నిండి 35 సంవత్సరాలలోపు వారై ఉండాలని, అభ్యర్థిని తప్పనిసరిగా వివాహితురాలై ఉండాలని వివరించారు. ఇతర వివరాలకు కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

కారెంపూడి: రంజాన్ మాసం ప్రారంభ శుభ దినాన కారెంపూడిలో ముస్లింలకు సర్పంచ్ రమావత్ తేజానాయక్ శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెంకటరామిరెడ్డి ముస్లింలకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. అంతకుముందు ప్రత్యేక ప్రార్థనలలో వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ ఆరిఫ్, జెడ్పీటీసీ షేక్ షఫీ, ముస్లిం పెద్దలు మౌలానా, అమీర్‌సాబ్, యాసిన్, షేక్ మీరా, ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, చెన్నకేశవస్వామి ట్రస్టు బోర్డ్ చైర్మన్ చల్లా ప్రసాద్, కొమెర పిచ్చెయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

వెల్దుర్తి: స్థానిక శ్రీశైలం రోడ్డులోని కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభించినట్లు అఖిల భారత వాసవి సత్ర సముదాయాల సలహా మండలి సభ్యులు చిల్లంచర్ల సత్యం చెప్పారు. ఏటా కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రోజూ ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు వెల్లడించారు.

పంట నష్టం నమోదు

నకరికల్లు: భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటల వివరాలు నమోదు చేసి నివేదిక తయారు చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని కుంకలగుంట, చల్లగుండ్ల గ్రామాల్లోని మొక్కజొన్న పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. 33శాతం కన్నా ఎక్కువగా నష్టపోయిన పంటల వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. పంటనష్టం వాటిల్లితే తమ దృష్టికి తేవాలన్నారు. అన్ని రకాల పంటలను నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖాధికారి దాసరి నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ సమీక్ష

ముప్పాళ్ళ: వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పంటనష్టం అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు వివరించారు. ఏఓ ఎం.అరుణ మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బందితో కలిసి వ్యవసాయశాఖ సిబ్బంది దెబ్బతిన్న పొలాలను సందర్శించి వివరాలు సేకరించాలని, నష్టం నమోదు వివరాలు పరిశీలించాలన్నారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు, ఆర్ఐలు ఆంజనేయులు, కపిల్‌దేవ్ పాల్గొన్నారు.

50 ఎకరాల్లో టమాట తోటలకు నష్టం

రాజుపాలెం: వడగళ్ల వానకు మండలంలో సుమారు 50 ఎకరాల టమాట తోటలు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖాధికారి నవీన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కోటనెమలిపురిలోని టమాట తోటలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలో 150 ఎకరాల టమాట తోటలు వేయగా అందులో సుమారు 50 ఎకరాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఆయన వెంట వీఏఏ జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న, అరటి తోటల పరిశీలన

పెదకూరపాడు: బలుసుపాడులో వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న, అరటి తోటలను శుక్రవారం ఉద్యానవన శాఖ అధికారి శ్రీనిత్య పరిశీలించారు. రైతులతో మాట్లాడి దెబ్బతిన్న పంటల నష్టం అంచనా వేసి, ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బి.హనుమంతరావు పాల్గొన్నారు.



కుంకలగుంటలో వాలిపోయిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



సమీక్షలో తహసీల్దార్ భవానీశంకర్, ఏఓ అరుణ



రాజుపాలెం మండలం కోటనెమలిపురిలో టమాటా తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి



అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి శ్రీనిత్య

• కమనీయ అలంకారం

పిడుగురాళ్ల పట్టణంలోని నాగులు గుడి దేవస్థానంలో దేవీ వసంత నవరాత్రులలో భాగంగా సరస్వతి అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రూ.4 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని సుమనోహరంగా అలంకరించారు. ఆలయ పూజారి వెంకటేశ్వరశర్మ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– పిడుగురాళ్ల



రసాయన పరిశ్రమలకు అనుమతులివ్వొద్దు

దాచేపల్లి నగర పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం



రసాయన పరిశ్రమలకు అనుమతులు ఇవ్వవద్దంటున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

దాచేపల్లి : ప్రజల ప్రాణాలకు హాని కలిగించే రసాయన పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ ఆధ్వర్యంలో అజెండాలో చేర్చిన అంశాన్ని రద్దు చేస్తూ తీర్మానం చేశారు. దీనికి టీడీపీ, జనసేన, స్వతంత్ర కౌన్సిలర్లు మద్దతు పలికారు. మెజార్టీ కౌన్సిలర్ల అభిప్రాయం మేరకు చైర్‌పర్సన్ సుబ్బమ్మ రసాయన పరిశ్రమల ఏర్పాటుతోపాటుగా ప్రస్తుతం ఉన్న కర్మాగారాల్లో కొత్త ప్రాజెక్టులు నిర్మించకుండా తీర్మానం చేశారు. దాచేపల్లి-1 వార్డు సచివాలయంలో శుక్రవారం కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ సుబ్బమ్మ అధ్యక్షతన జరిగింది. నడికుడి పారిశ్రామికవాడలోని మెస్సర్స్‌షియోగ హెల్త్‌కేర్ ఫ్యాక్టరీలోని భూగర్భంలో పెట్రోలియం క్లాస్ ఏ ప్రొడక్ట్‌కు సంబంధించిన మెథనల్, యాక్టోన్ ట్యాంకులు, క్లాస్‌బీ ప్రొడక్ట్‌కు సంబంధించి టాల్కన్ ఇసోప్రసి ఆల్కహాల్ డ్రమ్ముల స్టోరేజి షెడ్లు, మెస్సర్స్ శ్రీహిత్ లాబ్స్‌లోని భూగర్భంలో పెట్రోలియం క్లాస్ ఏ ప్రొడక్ట్‌కు సంబంధించి ఎస్ టోన్ మెథనల్, హెక్సెన్ ట్యాంకుల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం కోరుతూ జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తులు అందాయి. కలెక్టరేట్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కౌన్సిల్ అజెండాలో పెట్టిన అంశంపై సభ్యులకు అధికారులు వివరిస్తుండగా కౌన్సిలర్లు అడ్డుతగిలారు. ఈ అంశాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ తరువాత వైఎస్సార్ సీపీ సభ్యులకు టీడీపీ, జనసేన, స్వతంత్ర సభ్యులు కూడా మద్దతు తెలపగా చైర్‌పర్సన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

రసాయన పరిశ్రమలతో ప్రమాదమే

నడికుడి పారిశ్రామికవాడలో ప్రస్తుతం ఉన్న రసాయన పరిశ్రమల వల్ల నడికుడి, ఇరికేపల్లి, నారాయణపురం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ పరిశ్రమలను పూర్తిగా మూసివేయాలని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కూడా తాము కోరామని కౌన్సిల్ సభ్యులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వద్దని కోరారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, అధికారుల సహకారంతో రసాయన పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ సుబ్బమ్మ చెప్పారు. వేసవిలో నగర పంచాయతీ పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చైర్‌పర్సన్ చేసిన తీర్మానాన్ని సభ్యులు అమోదించారు. పలు అభివృద్ధి పనులకు సభ్యులు అమోదం తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎమ్మెల్యే కాసు సహకారంతో నగర పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ తెలిపారు. సమావేశంలో కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, వైస్ చైర్మన్లు కొమెర బత్తిన అన్నపూర్ణ, షేక్ మస్తాన్‌బీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి కాళికా మాత కుంభాభిషేకం

మాచవరం: పిన్నెల్లి గ్రామంలోని కాళికా మాత దేవస్థానంలో శనివారం నుంచి ఈనెల 27 వరకు పుష్కర కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 25న కోటి లింగాల మహాశివక్షేత్ర వ్యవస్థాపకులు శివస్వామి చేతుల మీదుగా అఖండ దీప స్థాపన, గ్రామ ప్రదక్షిణ, పూజా కార్యక్రమాలు, 26న మహా చండీయాగం, అమ్మవారి బోనాల శోభాయాత్ర, 27న మహా కుంభాభిషేక మహోత్సవం జరుగుతాయని వివరించారు.

తోపుడు బండి అందజేత



సత్తెనపల్లి: రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా జీవనోపాధి కోసం అబ్దుల్ కలాం చేయూత సంస్థ అధ్యక్షుడు వెలుగురి శరత్ ఆధ్వర్యంలో పట్టణంలోని 27వ వార్డులో పేద మహిళ షేక్ సమీమ్ టిఫిన్ హోటల్ నడుపుకునేందుకు తోపుడు బండిని శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాగూర్ మీరాన్, అచ్యుత శివప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు షేక్.మౌలాలి, గని, గుంటూరు జానీ, మహిబుల్లా, కరముల్లా, సుభానిఖాన్, ఖలీల్, హుస్సేన్, మౌలాలి, జిలానీ, గౌసమ్మ తదితరులు పాల్గొన్నారు.